AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

11-8-2026 (Tuesday) | MAIN EDITION

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ఈ నెల 18 నుంచి వన్‌వే అమలు చేయనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అండర్‌పాస్, ఫ్లైఓవర్ల నిర్మాణం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వన్ వే అమలులో ఉంటుంది. ఈ మేరకు ఇప్పటికే పోలీసులు ఏర్పాట్లు చేశారు. చెక్‌పోస్ట్ నుంచి పంజాగుట్ట వైపు రెండు వైపులా ట్రాఫిక్‌ను అనుమతించనున్నారు.

## పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితా వివాదం





**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్ల పరిష్కారంపై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా ఆయా వ్యక్తుల అప్పీళ్ల పరిష్కారానికి సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని న్యాయస్థానం ఆదేశించింది.

## గౌతమ్ అదానీకి ఊరట



అక్షరటుడే, బిజినెస్ డెస్క్ : అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీపై అమెరికా కోర్టులో కొనసాగుతున్న క్రిమినల్ ఆరోపణలు తొలగిపోయాయి. మోసం, లంచం వంటి తీవ్రమైన అభియోగాలకు సంబంధించి దాదాపు రెండేళ్లుగా సాగుతున్న విచారణను న్యాయస్థానం ముగిస్తూ ఆ కేసును కొట్టివేసింది.

## జాతీయ సగటును దాటిన వృద్ధిరేటు



అక్షరటుడే, ఏపీ : ఆంధ్రప్రదేశ్ ప్రణాళికా శాఖ 2026 జులై నెలకు సంబంధించిన ఆర్థిక నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రికి అందించింది. రాష్ట్రంలో ఎల్‌నినో కారణంగా ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సంక్షోభం ఉన్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థలో మంచి వృద్ధి నమోదైనట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది.


## మిస్సింగ్ కేసులపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు



అక్షరటుడే, ఢిల్లీ : ఎవరైనా వ్యక్తి అదృశ్యమైనట్లు సమాచారం అందితే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న తన మునుపటి ఉత్తర్వులు అందరికీ వర్తిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను పాటించని రాష్ట్రాలు కోర్టుధిక్కరణ చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

## శ్రీశైలం ప్రాజెక్ట్‌కు తగ్గిన వరద

**అక్షరటుడే, శ్రీశైలం :** శ్రీశైలం ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో జలాశయం నీటిమట్టం నిలకడగా ఉంది. ఎగువన ప్రాజెక్టుల గేట్లు మూసివేయడంతో శ్రీశైలంకు ఇన్‌ఫ్లో తగ్గింది. ప్రస్తుతం జలాశయానికి 51,016 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 44,928 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఆ నీరు నాగర్జున సాగర్‌కు వెళ్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 181.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది. విద్యుత్ ఉత్పత్తి కారణంగా జలాశయం నీటిమట్టం నిలకడగా ఉంది.



## నేడు రాష్ట్రానికి మోస్తరు వర్ష సూచన

**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణలోని పలు జిల్లాల్లో మంగళవారం మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సాయంత్రం వరకు వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రివేళ వాన పడుతుందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో లోటు వర్షపాత నమోదు అవుతుందని తెలిపారు. రానున్న 7 నుంచి 10 రోజుల్లో పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు అవుతుంది. మిగతా జిల్లాల్లో తక్కువ వర్షాలు కురుస్తాయన్నారు.

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులు షెల్ కంపెనీల పేరిట అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డొల్లా కంపెనీల బాగోతాన్ని బయట పెడతానన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రూ. లక్షతో మొదలైన టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేటాయించిందని ఆరోపించారు. ఈ కంపెనీ ఛైర్మన్‌గా రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి ఉన్నారన్నారు.** - అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# ‘అనుముల’ బ్రదర్స్ అక్రమాలు

■ సీఎం సోదరుల పేరిట షెల్ కంపెనీలు ■ ఆ సంస్థలకు భూముల కేటాయింపు ■ కేటీఆర్ సంచలన ఆరోపణలు

రేవంత్‌రెడ్డి సోదరులపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. వారికి పొట్ట కోస్తే అక్షరం ముక్క రాదని, వీళ్ళందరూ ఉన్నట్లుండి కోట్లు, బూట్లు వేసుకొని పెద్ద పెద్ద కంపెనీలకు ఛైర్మన్లు ఎలా అయ్యారని ప్రశ్నించారు. ఈ కంపెనీలో కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేడన్నారు. రేవంత్ రెడ్డి తన మరో సోదరుడు అనుముల జగదీష్ రెడ్డితో అమెరికాలో రూ.1000 కోట్లతో స్వచ్ బయో అనే కంపెనీ పేరు మీద ఎంవోయూ చేసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. జగదీష్ రెడ్డికి కూడా ఎక్కడ భూమి ఇచ్చారో తవ్వి తీయాలని డిమాండ్ చేశారు.

### బావమరిదికి కాంట్రాక్ట్

మోదీ ప్రభుత్వంతో కలిసి రేవంత్ రెడ్డి తన బావమరిది సృజన్ రెడ్డికి రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్ట్ ఇచ్చారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం, మోదీ ప్రభుత్వం కలిసి నడుపుతున్న సింగరేణిలో వేల కోట్ల కుంభకోణాలు సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్నారు. బహిరంగంగా టెస్సరాక్ట్ కంపెనీ ఛైర్మన్ తానే అని కొండల్ రెడ్డి ప్రచారం చేసుకుంటుంటే, రేవంత్ రెడ్డి సోదరుడికి దీనికి సంబంధం లేదని శ్రీధర్ బాబు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన శాఖలో ఏం జరుగుతుందో ఆయనకు తెలుసా అన్నారు.

### యాగం చేస్తే లాభం ఏమిటి

మోటర్లు ఆన్ చేయకుండా యాగాలు చేస్తే లాభమేంటని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి మాత్రమే వరుణ యాగం చేశారన్నారు. నీరు కిందకు పోతుంటే ఎత్తిపోయకుండా.. ఇప్పుడు యాగాలు చేయడం ఏమిటన్నారు. తెలంగాణలో ఏడు ప్రాజెక్టులను రద్దు చేసే అంశంపై జీఆర్ఎంబీ జరిగే మీటింగ్‌ను కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం బాయ్‌కాట్ చేయకపోతే జలసౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆ అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం పట్టుబడితే అజెండాలో పెట్టారన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సిగ్గుంటే ఆ మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయాలన్నారు. తెలంగాణ రైతుల తరఫున తాము పోరాడుతామన్నారు. ఏపీతో పాటు పలు రాష్ట్రాల్లో ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చారని, కానీ పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వమని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చెప్పినా, చేతకాని బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఉన్నారన్నారు.

## పార్లమెంట్ ఆవరణలో ఉద్రిక్తత




**అక్షరటుడే, ఢిల్లీ :** పార్లమెంట్ ఆవరణలో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రతిపక్ష, ఎన్డీఏ ఎంపీలు ఒకరికొకరు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు హాజరై ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అణచివేత గురించి వివరించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ.. ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. మరోవైపు హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో కాంగ్రెస్ ఒక జూనియర్ భాగస్వామిగా ఉన్న జార్ఖండ్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో, అధికార పార్టీ ఎంపీలు ప్రతి నిరసన చేపట్టి, రాహుల్ గాంధీ చర్చల నుండి పారిపోతున్నారని, ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్నారని బీజేపీ ఎంపీలు ఆరోపించారు.


## చర్చ నుంచి పారిపోతున్న రాహుల్ గాంధీ : బీజేపీ ఎంపీలు



**అక్షరటుడే, ఢిల్లీ:** విద్యార్థుల నిరసనల అంశంపై చర్చకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రతిపక్షాలు చర్చకు వెనకాడుతున్నాయని ఎన్డీఏ ఎంపీలు ఆరోపించారు. ఈ మేరకు పార్లమెంట్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. జార్ఖండ్ యువతకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. వారిపై జరిగిన లాఠీచార్జీలు, అరాచకాలు రాహుల్ గాంధీ మనస్తత్వాన్ని బయటపెట్టాయన్నారు. ఆయన మద్దతుదారులు పాలించే రాష్ట్రంలో యువత పట్ల ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారో, వారికి ఎలా న్యాయం నిరాకరించబడుతోందో ఇది చూపిస్తుందన్నారు. మరోవైపు స్వయంగా సభకు హాజరుకాని రాహుల్ గాంధీ హోం మంత్రిని సమాధానాలు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు.

## రాష్ట్రంలో ముగిసిన ఎస్ఐఆర్

**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసింది. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, ఆన్‌లైన్‌లో నమోదు ముగియడంతో ఓటర్ల లెక్క తేలనుంది. ఎన్నికల సంఘం త్వరలో ముసాయిదా జాబితాను విడుదల చేయనుంది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. వీరికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేశారు. ఇందులో 2,64,87,214 (78శాతం) ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేశారు. 9,22,230 మంది ఓటర్లు చనిపోయినట్లు గుర్తించారు. 11,25,546 మంది ఓటర్లను అధికారులు గుర్తించలేకపోయారు. 45,18,961 మంది శాశ్వతంగా వలస వెళ్లారు.




## నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ తీర్మానం




**అక్షరటుడే, తమిళనాడు:** తమిళనాడు అసెంబ్లీలో నీట్, ఎఫ్‌సీఆర్ఏ బిల్లులకు వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్య ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ, పేద విద్యార్థులకు నీట్ ప్రతికూలంగా ఉందని తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది. ఖరీదైన కోచింగ్ వల్ల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. అండర్ గ్రాడ్యుయేట్ వైద్య ప్రవేశాల కోసం ఉన్న నీట్‌ను రద్దు చేయడానికి, కేంద్ర చట్టాలను సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని శాసనసభ కోరింది. అధిక రుసుములు వసూలు చేస్తూ, నియంత్రణ లేని కోచింగ్ సెంటర్లు పెరిగిపోతున్నాయని, ఇవి విద్యార్థులను పాఠశాల పాఠ్యాంశాలను పక్కనపెట్టి, ప్రధానంగా నీట్ ప్రిపరేషన్‌పైనే దృష్టి పెట్టేలా చేస్తున్నాయని పేర్కొంది.

## ఆర్టీసీ మెకానిక్ మృతి



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని జీడిమెట్లలో విషాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ డిపోలో బస్సు బ్రేకులను బాగుచేస్తుండగా, బస్సు ఒక్కసారిగా ముందుకు కదలడంతో 39 ఏళ్ల మెకానిక్ సంతోష్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. బస్సు బ్రేక్ సమస్య రావడంతో మెకానిక్ సంతోష్ కుమార్ మరమ్మతులు చేస్తున్నారు. ఆయన బస్సు కింద నుంచి బయటకు రాకముందే డ్రైవర్ బస్సును ముందుకు తీసుకెళ్లాడు. దీంతో అది మెకానిక్ పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

## కేంద్రంపై ప్రకాష్ రాజ్ విమర్శలు



**అక్షరటుడే, బెంగళూరు:** ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ ఓటును ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అధికారులు తొలగించారు. ఆయనకు నాలుగు ఓట్లు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో, బెంగళూరులోని ఆయన ఓటును ఎన్నికల సంఘం తొలగించింది. బెంగళూరు ఓటర్ల జాబితా నుంచి తన పేరు తొలగించడంపై ప్రకాష్ రాజ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సవరించిన ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో దాదాపు 65 లక్షల మంది ఓట్లు తొలగించారని, అందులో తన పేరు కూడా ఉందని , ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోందని 'ఎక్స్' వేదికగా తెలిపారు.

## మన్మోహన్ సింగ్‌కు క్లీన్ చిట్ చారిత్రాత్మకం

**అక్షరటుడే, ఢిల్లీ :** బొగ్గు బ్లాకుల కేటాయింపుల కుంభకోణం కేసులో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు సీబీఐ ఇచ్చిన క్లీన్‌చిట్‌ను సుప్రీంకోర్టు సమర్థించడం చారిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అభివర్ణించారు. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో ఓ గొప్ప అర్థశాస్త్రవేత్త, దార్శనికుడిపై ఏళ్ల తరబడి సాగిన రాజకీయ వేధింపులు, కుట్రలకు తెరపడిందని ఆమె పేర్కొన్నారు. తగిన ఆధారాలు లేకుండానే మాజీ ప్రధానిపై తీవ్ర ఆరోపణలు చేసిన విచారణ కోర్టును సుప్రీంకోర్టు తప్పుపట్టిందని, సీబీఐ సమర్పించిన క్లోజర్ రిపోర్ట్‌ను ఆమోదించి కేసును పూర్తిగా మూసివేసిందని గుర్తుచేశారు.

